క్లుప్తంగా

కేఎంటీపీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి



గీసుకొండ : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ (కేఎంటీపీ)లో స్థానికులకు, భూములు ఇచ్చిన రైతుల కుటుంబాల్లోని యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని శాయంపేట హవేలీ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఆ గ్రామానికి చెందిన పలువురు కైటెక్స్ ఎండీ మనోజ్‌కుమార్‌ను గురువారం కలిసి దరఖాస్తులు అందజేశారు. తమకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

సన్మానం

పర్వతగిరి : మండలంలోని పెద్దతండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు బాదావత్ రాజును రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్న సందర్భంగా గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్వేరోస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా స్వేరోజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల ప్రవీణ్, జిల్లా అధికార ప్రతినిధి గారె జయరాజ్ మాట్లాడారు. రాజును అభినందించారు. కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు బానోతు రమేశ్, వంగాల దినేశ్, ధరావత్ జీవన్, తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలివ్వాలి

నర్సంపేట : గతంలో తీసుకున్న రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేసిన క్రమంలో తమకు మళ్లీ పంట రుణాలివ్వాలని చెన్నారావుపేట సొసైటీ పరిధిలోని రైతులు బొల్లెపల్లి మల్లస్వామి, గుగులోతు రాజు, కన్నం ప్రభాకర్, ధర్మసోతు సక్కు, బీక్య, ఆల్య కోరారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. చెన్నారావుపేట సొసైటీలో తాము తీసుకున్న రుణాలను ప్రభుత్వం జనవరి 10న మాఫీ చేసిందన్నారు. ఈ క్రమంలో తమకు మళ్లీ పంట రుణాలివ్వాలని కోరారు.

ఐదుగురి బైండోవర్


దుగ్గొండి : మండలంలోని అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ రాజేశ్వర్‌రావు ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి తెలిపారు. పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నలుగురు మహిళలు, ఓ పురుషుడు అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. గ్రామాల్లో అనుమానితుల సంచారంపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ



వర్ధన్నపేట : ఈనెల 20న పట్టణంలో నిర్వహించనున్న తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి సంబంధించిన కరపత్రాలను స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన అంబేడ్కర్ వాదులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు, జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కంచర్ల మహేశ్, జిల్లా కన్వీనర్ జంగిలి భాస్కర్, నాయకులు జనగాం చంద్రమౌళి, కొండేటి మహేందర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు

పరామర్శ



రాయపర్తి : మండలంలోని కొండూరుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తాళ్లపెల్లి శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. అనంతరం మైలారంలో తాళ్ల సుగుణమ్మ, శివరామపురంలో మారెపల్లి గోపాల్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను సైతం దయాకర్‌రావు కలిసి ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు లేతాకుల రంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, సాయి తదితరులున్నారు.

ఇసుక డంపు సీజ్

ఐనవోలు : మండలంలోని లింగమోరిగూడెంలోని ఇసుక డంపులపై రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు దాడి చేశారు. బుధవారం 2, గురువారం 1 ఇసుక డంపును సీజ్ చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. నందనంలో సుమారు 70 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపును గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. గజ్జెల శ్రీరాములుకు చెందిన భూమిలో ఆరెల్లి లక్ష్మయ్య అక్రమంగా నిల్వ చేసినట్లు తెలిసిందని ఎస్సై చెప్పారు.

నాణ్యమైన నారుతో అధిక దిగుబడి

● నారుమడిలో యాజమాన్య పద్ధతులు



నెక్కొండ : నాణ్యమైన నీరుతో అధిక దిగుబడి సాధించొచ్చు. రైతులు జాగ్రత్తగా నారుమళ్లు పోసుకుంటే నాణ్యమైన నారు, దిగుబడి పొందవచ్చు. పంట సాగులో నారుమడి యాజమాన్య పద్ధతులు కీలకం. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలో రైతులు సుమారు లక్షా 4 వేల ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) ఎగిడి నాగరాజు తెలిపారు. నారుమడిలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను ఆయన వివరించారు.



రైతు ఏర్పాటు చేసుకున్న నారుమడి (ఫైల్)

విత్తన మోతాదు

నాటే పద్ధతిని బట్టి వెదజల్లడానికి 20–25 కిలోల విత్తనాలను వినియోగించవచ్చు. సాధారణ భూముల్లో 24–30 కిలోలు వాడవచ్చు. సహజంగా వెదజల్లడానికి 16–30 కిలోలు సరిపోతాయి. విత్తడానికి (వర్షాధారపు వరి)కి సంబంధించి 30–36 కిలోలు అవసరం.

విత్తన శుద్ధి

కిలో విత్తనానికి 2.5 గ్రాముల కార్బండిజమ్ కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లాలి. దంప నారుమళ్లకైతే లీటరు నీటికి గ్రాము కార్బండిజమ్ సరిపోతుంది. ఈ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టాలి. మరో 24 గంటలపాటు మండీ కట్టి మొలకలను దంప నారుమడిలో చల్లాలి. కిలో విత్తనాలను నానబెట్టడానికి లీటరు సరిపోతుంది. అలాగే 10 లీటర్ల నీటికి 1.5 కిలోల ఉప్పు కలిసిన ద్రావణాన్ని ఎంపిక చేసుకున్న విత్తనాన్ని పోసి పైకి తేలిన విత్తనాలను తొలగించాలి. ఉప్పు నీటిలో మునిగిన గట్టి విత్తనాలను మాత్రమే నారు పోయడానికి వినియోగించాలి. మడిలో చల్లే ముందు 24 గంటలపాటు మంచినీటిలో విత్తనాలను నానబెట్టాలి. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3 గ్రాముల చొప్పున థైరమ్ లేదా కాప్టాన్ మందు కలిపి విత్తన శుద్ధి చేయాలి. నారుమడిలో చల్లే విత్తనాలు ముందు, మొలకెత్తిన విత్తనాన్ని 0.2 శాతం క్లోరోపైరిఫాస్ ద్రావణంలో నానబెట్టి చల్లాలి. తద్వారా నారు మడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు ఆశించకుండా నిరోధించొచ్చు.

ఎరువుల సస్యరక్షణ

విత్తిన 10 రోజులకు కార్బోప్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాములు వేయాలి లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరోపైరిఫాస్ 2 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి విత్తనాలపై 10 నుంచి 17 రోజుల వరకు పిచికారీ చేయాలి లేదా నారు తీయడానికి వారం రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున కార్బోప్యూటరాన్ గుళికలు తక్కువ నీటిలో వేయాలి.

యాజమాన్య పద్ధతి

నారుమడులు సిద్ధం చేయాలనుకున్న భూమిలో వేసవి దుక్కులకు ముందుగానే పశువుల పెంటను ఎరువుగా వేయాలి. నారుమడులు పోయడానికి పొలంలో 10వ భాగాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న పొలానికి నీరు పెట్టి బాగా కలియదున్నాలి. తర్వాత మట్టి గడ్డలన్నీ మెత్తబడేలా దమ్ము చేయాలి. మొక్కలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే 5 సెంట్ల నారుమడికి 2 కిలోల చొప్పున నత్రజనిని కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12–14 రోజులకు, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయొచ్చు.

నారుమడి తయారీ ఇలా..

దుమ్ము చేసిన నేలలో 10 మీటర్ల పొడవు, మీటరు వెడల్పుతో నారుమడి ఏర్పాటు చేసుకోవాలి. నారుమడిలో నీరు, పోషకాలు బయటకు పోకుండా గట్లు సమంగా గట్టిగా పోయాలి. మడిలో చెత్తాచెదారం తొలగించాలి. నారుమడి బురద పదునులో ఉండాలి. నారుమడులు ఎత్తుగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. రెండు మడుల మధ్య 20 సెంటీమీటర్ల వెడల్పుతో కాల్వ తీయాలి. కాల్వలోని మట్టిని మడిలో వేసి నారుమడిని ఎత్తుగా చేసుకోవాలి. నారుమడి మొత్తం చదునుగా ఉండాలి. నారుమడిని 10–12 రోజుల ముందే దమ్ము చేసి చదును చేసుకోవాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాల్వలు సిద్ధం చేయాలి. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లాలి. నారు పూర్తిగా పురివిప్పుకునే వరకు ఆరు తడులు ఇచ్చి తర్వాత పల్చగా నీరు నిల్వ కట్టాలి. జింక్ లోపాన్ని గమనించి 2 గ్రాములు జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే జింక్ లోపం ఎక్కువగా కనపడుతుంది. తల్లి పురుగు గుడ్లను కొనల మీద పెడుతుంది. నారు నాటేటప్పుడు కొనలు విరిచి నాటాలి. తద్వారా గుడ్లను నిర్మూలించవచ్చు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

● కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి

నర్సంపేట : ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని బోడమాణిక్యంతండాలో రజిత వెంకట్ చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పార్టీ మండల ఉపాధ్యక్షుడు భూక్య మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో వెంకట్‌రెడ్డి గురువారం ముగ్గు పోసి ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని పేదందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ రమబాయి మైబుసింగ్ రాథోడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, పంచాయతీ కార్యదర్శి రంజిత్, ఏఈ భవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం



వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లికి చెందిన హైదరాబాద్ ఐఐటీ విద్యార్థి గోలి సింధూజకు మహా ఆది సేవా సంస్థ (మాస్) బృందం గురువారం రూ.20 వేల ఆర్థికసాయం అందజేసింది. తొలుత సంస్థ ప్రతినిధులు సింధూజను శాలువాతో సత్కరించారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ప్రతిభను చాటి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు, జాతీయ సాథయిలో 336 ర్యాంక్ సాధించి హైదరాబాద్‌లోని ఐఐటీలో సీటు సాధించడం పట్ల అభినందించారు. పేదరికం నేపథ్యంలో సింధూజకు స్టడీ మెటీరియల్, ఇతర అవసరాల కోసం నగదు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులైన కొత్తగూడెం ప్రభుత్వ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కిశోర్ కుమార్, మైనింగ్ డిపార్ట్‌మెంట్ విశ్రాంత ఉద్యోగి సినపెల్లి కొమురయ్య, డాక్టర్ విజయ్‌కుమార్, సెర్ప్–డీఆర్‌డీఏ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లకు బస్సులు ఏర్పాటు చేయాలి

● జేఏసీ జిల్లా నాయకుడు బూడిద సునీల్

రాయపర్తి : ప్రభుత్వ స్కూళ్లకు బస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా నాయకుడు బూడిద సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్ శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం సునీల్ మాట్లాడారు. సరైన రవాణా సదుపాయం లేక గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురు పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు బస్సులు ఏర్పాటు చేస్తే విద్యార్థుల సమయం ఆదా అవుతుందని చెప్పారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లల్లో ఉచిత బస్సులు, ఇతర సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గారె వెంకటస్వామి, గారె మహేందర్, శ్రీకాంత్, గణేశ్, స్వామి, శ్రీదత్త తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రేషన్‌కార్డులు అందించాలి



దుగ్గొండి : అర్హులకు వెంటనే రేషన్‌కార్డులు అందించాలని మండలంలోని తిమ్మంపేట మాజీ సర్పంచ్ మోడెం విద్యాసాగర్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో గ్రామస్తులు జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కిష్టయ్యను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం విద్యాసాగర్ మాట్లాడారు. గ్రామానికి చెందిన సుమారు 200 మందికి చెందిన దరఖాస్తుల స్టేటస్ 'డీఎస్‌ఓ పెండింగ్' చూపిస్తోందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మామునూరి విఘ్నేశ్, స్వామి తదితరులున్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చాంద్ పాషా, నాయకులు

● సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ పాషా

పర్వతగిరి : ఈనెల 16న హనుమకొండ జిల్లా కేంద్రంలోని సిటిజన్ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న బ్యాండు, వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు మహ్మద్ చాంద్‌పాషా కోరారు. మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు నజీరుద్దీన్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశం సందర్భంగా సదస్సు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాంద్‌పాషా మాట్లాడారు. బ్యాండు, వాయిద్య కళాకారుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి సంఘం పాటుపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడిపెద్ది వెంకన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెండి బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాడేటి రాజు, మండల ఉపాధ్యక్షుడు అల్లం కట్టయ్య, కార్యదర్శి బండారి దేవేందర్, కోశాధికారి యాకూబ్ పాషా, సహ కార్యదర్శి సిరికొండ వీరస్వామి, సభ్యులు ఎలికట్టె ఉపేందర్, బాషబోయిన సుధాకర్, సిరికొండ వెంకన్న, అల్లాడి వీరస్వామి, బాషా, అమీర్ పాషా, తాళ్ల చిన్ని, తౌర్రి సంపత్, దబ్బెట చేరాలు, యాకస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా మేలు

పర్వతగిరి : రైతులు యూరియాకు బదులు నానో యూరియాను వినియోగించడం మేలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) ప్రశాంత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. యూరియాతో భూములు విషతుల్యం అవుతుండడంతో ప్రభుత్వం నానో యూరియాను అందుబాటులోకి తీసుకొస్తోందని పేర్కొన్నారు. యూరియాపై సబ్సిడీని ప్రభుత్వం క్రమంగా ఎత్తివేస్తుందని తెలిపారు. నానో యూరియా నీటిలో కలిపి పిచికారీ చేసేలా ఉంటుందని వివరించారు. రైతులు నానో యూరియా వినియోగించాలని చెప్పారు. యూరియా కంటే మెరుగైన ఫలితాలు లభిస్తాయని స్పష్టం చేశారు.

'గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యం'

ఐనవోలు : గ్రామాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తంపుల మోహన్, మండల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు అన్నారు. మండలంలోని రాంనగర్, నందనం గ్రామాల్లో గురువారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చినా వాటిని ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి 16 నెలలు గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించలేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేలా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్‌లు వేణు, రాకేష్, జయశంకర్, జగపతి, రఘువంశీ, క్రాంతి, సుదర్శన్, దేవదాస్, అశోక్, రాజేంద్ర ప్రసాద్, జిందా, శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులతో హెచ్‌ఎం, ఇందిర దంపతులు, టీచర్లు

వర్ధన్నపేట : మండలంలోని దమ్మన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఉపాధ్యాయురాలు ఇందిర రూ.30 వేలతో సమకూర్చిన దుస్తులను భర్త జయపాల్‌రెడ్డితో కలిసి గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. వచ్చే నెలలో తాను ఉద్యోగ విరమణ చేయనున్న క్రమంలో విద్యార్థులకు తెల్లటి దుస్తులు కానుకగా అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.మహేశ్ నాయక్, ఉపాధ్యాయులు సదానందం, సంపత్ కుమార్, వినోద్‌కుమార్, కవిత, ప్రభ, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం



నర్సంపేట రూరల్ : పాటలు పాడుతున్న కళాకారులు



పర్వతగిరి : మాట్లాడుతున్న ఏపీఎం కృష్ణమూర్తి

● ఏపీఎం మహేందర్

నర్సంపేట రూరల్ : మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఐకేపీ నర్సంపేట ఏపీఎం మహేందర్ తెలిపారు. మండలంలోని మహేశ్వరంలో గురువారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలకు ఆయన హాజరై మాట్లాడారు. వ్యవసాయ రంగంలోనూ సబ్సిడీపై కోళ్లు, పాల డెయిరీల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. మహిళా సంఘాలకు బస్సులు ఇప్పించి వాటిని ఆర్టీసీకి ఇవ్వడం ద్వారా ఆదాయం సమకూర్చుతున్నట్టు చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా వడ్డీ లేని రుణాలు, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారధి నర్సంపేట టీమ్ లీడర్ నెల్లుట్ల సుమన్ ఆధ్వర్యంలో కళాకారులు తాళ్ల సునీల్, యోచన, పడిదం రాజేందర్, గాదె పాక బాబు కళా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సీసీ వణమ్మ, వీఓ సుజాత, మాధవి, సవిత, శ్రావణి, రమ, రాధిక, సుమలత, శారద, కోమల, శిరీష, భార్గవి, మమత తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండలో నిర్వహించిన సంబురాలకు ఏపీఎం తోటకూరి కృష్ణమూర్తి హాజరై మాట్లాడారు. కళాజాత నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు, అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తోందని చెప్పారు. రుణ బీమా, ప్రమాద బీమా, తదితరాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు సుధాకర్, రవీందర్‌రాజు, కాంతయ్య, వీఓఏలు రాజయ్య, రమాదేవి, నర్సింహులు, ఉమ, నర్మద, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



వర్ధన్నపేట : కళాకారులను సన్మానిస్తున్న కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట/దుగ్గొండి : వర్ధన్నపేట, దుగ్గొండి మండలాల్లో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేటలోని ఇల్లందలో బీజేపీ అనుబంధ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ రిటైర్డ్ ఎంఈఓ తక్కళపల్లి ప్రసాద్‌రావును, చిందు యక్షగాన కళాకారులు గజవెల్లి వెంకన్న, బైండ్ల భవానీ, తదితరులను సన్మానించారు. దుగ్గొండిలోని బస్టాండ్ సెంటర్‌లో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు భజన చేశారు. దేవులపల్లి సదానందం దంపతులు అన్నదానం చేశారు. స్థానికుడు పాండవుల రమేశ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రల బాబుతో కలిసి తన వ్యవసాయ క్షేత్రంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.



దుగ్గొండి : ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు

దేవుడిని మోసం చేసినోళ్లు బాగుపడలే..

● మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



గీసుకొండ : ఆలయంలో మురళి, నవీన్‌రాజ్

గీసుకొండ : దేవుడిని మోసం చేసినోళ్లెవరూ బాగుపడలేదని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అన్నారు. మండలంలోని కొండగిరి సాయినాథుని ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తానెప్పుడూ దేవుడిని మోసం చేయలేదని చెప్పారు. తాను పేదలకు సాయం చేసే విషయంలో లెఫ్ట్ ఐడియాలజీతో ఉంటానని తెలిపారు. ఆలయాలకు సంబంధించి దైవభక్తిని ప్రదర్శిస్తానన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో నెయ్యి కొనుగోలు విషయంలో కల్తీ జరిగిన విషయాన్ని తెలుసుకుని తన భార్య, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు తెలంగాణలో అక్రమాలు జరగకుండా విజయ నెయ్యినే ఆలయాల్లో ఉపయోగించేలా చొరవ చూపించినట్టు తెలిపారు. తల్లిదండ్రుల దీవెనలతోనే తాను ఎదిగినట్టు వివరించారు. కోటమైసమ్మ, రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయాలను తానే అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఇప్పటికీ అమ్మవారిని చూస్తే తనకు భయమేస్తుందన్నారు. అమ్మవార్ల దీవెన తనకు ఉందని చెప్పారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలి

ఖిలా వరంగల్: బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా కార్యదర్శి చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రానికి గవర్నర్ ద్వారా పంపించినప్పటికీ మోదీ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని అన్నారు. శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో మొటం కుమారస్వామి అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓర్సు రాజుతో కలిసి కుమారస్వామి మాట్లాడారు. అసంఘటిత కార్మికులుగా పనిచేస్తున్న బీసీలను అణగదొక్కడానికి, వారి శ్రమను దోపిడీ చేయడానికి మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. బీసీ కార్మికుల హక్కుల పరిరక్షణకు ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట జరగనున్న ధర్నాలో బీసీలు అధికసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు కుమార్, పద్మ, రజని, దివ్య, రమేష్, ప్రభాకర్ పాల్గొన్నారు

ఆరె కటికల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

రామన్నపేట: ఆరె కటిక కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తానని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. 11వ డివిజన్ అలంకార్ జంక్షన్‌లో ఆరె కటిక గురువు ధర్మవ్యాధుడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి ఎంపీ కావ్య గురువారం ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐకమత్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ మిరియాల్‌కార్ దేవేందర్, సురేందర్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.